لَنْ تَنَالُوا الْبِرَّ حَتّٰى تُنْفِقُوْا مِمَّا تُحِبُّوْنَ ۬ؕ وَمَا تُنْفِقُوْا مِنْ شَیْءٍ فَاِنَّ اللّٰهَ بِهٖ عَلِیْمٌ ۝

మీకు అత్యంత ప్రీతికరమైన దానిని మీరు ధర్మ మార్గమున వినియోగించునంత వరకు గొప్ప పుణ్యమును పొందలేరు.మీరేది వినియోగించినను అల్లాహ్ దానిని నిశ్చయముగా బాగుగా ఎరుగును.

(ఆలె ఇమ్రాన్:93)

# తహ్రీకె జదీద్

## 84వ

## సంవత్సర ఆరంభ శుభ ప్రకటన

## ఖుత్బా జుమా

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్

3 నవంబర్ 2017

మస్జిద్ బైతుల్ ఫుతూహ్ మోర్డన్ లండన్

ప్రచురణ: వకాలతె మాల్ తహ్రీకె జదీద్ అన్జుమన్ అహ్మదియ్యా భారత్ - ఖాదియాన్

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

## తహ్‌రీకె జదీద్ 84వ ఆర్థిక సంవత్సర ప్రారంభ ప్రకటన

గత సంవత్సరం జమాఅత్ 1,25,80,000 పౌండ్ల ధన త్యాగము చేసెను

అల్లాహ్ తఆలా కృపానుసారము అహ్మదియ్య జమాఅత్ భారత్ గత సంవత్సరం కూడ తన స్థాయిని నిలుపుకొనెను.

తహ్‌రీకె జదీద్ చందాదారుల సంఖ్యను పెంచుకొనుటకు ఇంకా చాలా అవకాశము గలదు

**జమాఅత్ సభ్యులు, నిర్వహకులు ఇటువైపు ప్రత్యేక దృష్టి సారించవలెను**

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 03 నవంబర్ 2017 (03 నభువ్వత్ 1396 హి.ష) తేదీన బైతుల్ ఫుతూహ్ మోర్డన్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా**

اَشۡھَدُ اَنۡ لَّاۤ اِلٰہَ اِلَّا اللّٰہُ وَحۡدَہٗ لَا شَرِیۡکَ لَہٗ وَاَشۡھَدُ اَنَّ مُحَمَّدًا عَبۡدُہٗ وَ رَسُوۡلُہٗ

اَمَّا بَعۡدُ فَاَعُوۡذُ بِاللّٰہِ مِنَ الشَّیۡطٰنِ الرَّجِیۡمِ -بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ-

اَلۡحَمۡدُ لِلّٰہِ رَبِّ الۡعٰلَمِیۡنَ-الرَّحۡمٰنِ الرَّحِیۡمِ -مٰلِکِ یَوۡمِ الدِّیۡنِ-

اِیَّاکَ نَعۡبُدُ وَاِیَّاکَ نَسۡتَعِیۡنُ-اِھۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِیۡمَ-

صِرَاطَ الَّذِیۡنَ اَنۡعَمۡتَ عَلَیۡھِمۡ ۙ۬ غَیۡرِ الۡمَغۡضُوۡبِ عَلَیۡھِمۡ وَلَا الضَّآلِّیۡنَ-

لَنۡ تَنَالُوا الۡبِرَّ حَتّٰی تُنۡفِقُوۡا مِمَّا تُحِبُّوۡنَ ۬ؕ وَمَا تُنۡفِقُوۡا مِنۡ شَیۡءٍ فَاِنَّ اللّٰہَ بِہٖ عَلِیۡمٌ-

అనగా అత్యంత ప్రీతికరమైన దానిని మీరు ధర్మ మార్గమున వినియోగించునంత వరకు నిజమైన పుణ్యమును పొందలేరు. మీరేది వినియోగించినను అల్లాహ్ దానిని నిశ్చయముగా బాగుగా ఎరుగును. (ఆలె ఇమ్రాన్:93)

అల్లాహ్ తఆలా ఈ సూక్తిలో ప్రస్తావించిన అంశమును కేవలం అల్లాహ్ తఆలా మార్గములో త్యాగాలు చేయు విశ్వాసులే సరిగ్గా అర్థం చేసుకోగలరు. ఈ అంశమును గూర్చిన అవగాహనను అందరి కన్న ఎక్కువగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులే కల్గి యుండిరి. వారు తమ ధనమును, తమ ప్రాణమును, తమ సమయమును ధర్మము కొరకు త్యాగము చేసిరి. అత్యంత ప్రీతికరమైన పుణ్యమును వారే వాస్తవరీతిలో అర్థము చేసుకొనిరి. అనగా సత్కర్మలలో అత్యంత ఉత్తమమైన ప్రామాణిక స్థాయిని వారు గ్రహించి దానిని పొందుటకు ప్రయత్నించారు. అది నిష్టాపరత యొక్క ఉన్నతమైన స్థానము. సత్ప్రవర్తనల గొప్ప స్థాయి. ధన త్యాగము చేయువారికి కూడ ఇదొక అరుదైన స్థానము. అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటకు ఇదొక గొప్ప స్థాయి. ఒక కథనములో ఇలా గలదు. ఈ సూక్తి అవతరించినప్పుడు హజ్రత్ అబూ తల్‌హా రజియల్లాహు అనుహు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లు వేడుకొనిరి. ఓ దైవ ప్రవక్త! నా ఆస్తులలో బెర్‌హా అను తోట గలదు, అది మస్జిద్ నబ్వీకి చాలా సమీపములో గలదు. నా అస్తులలో అన్నిటి కంటే ఎక్కువ నా ఈ తోటే నాకు ఇష్టమైనది. నేడు దానిని నేను దైవ మార్గంలో దానము చేయదలచితిని.

(సహీ బుఖారి, కితాబు తఫ్సీరుల్ ఖుర్‌ఆన్, బాబ్ లన్‌తానుల్ బిర్ర .......హదీస్ సంఖ్య 4554)

ఇది అనుచర వర్గీయుల త్యాగాల ప్రామాణికము. నేడు కూడ అల్లాహ్ తఆలా అనుగ్రహము వలన అన్ని రకాల త్యాగాల భావన అందరి కన్న ఎక్కువగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడిని విశ్వసించే వారికే గలదు. అల్లాహ్ తఆలా అనుగ్రహము వలన ఈ భావనను అందరి కన్న ఎక్కువగా అహ్మదియులే ఆచరణ రూపంలో చూపుచున్నారు. నేడు ప్రపంచములో ధనమును, విలాసవంతమైన సామాగ్రిని ప్రోగుచేసుకొను పరుగు పందెం కొనసాగుతుంది. కాని అహ్మదీయులలో అధికులు ధనమును, డబ్బును

సంపాదించినప్పటికి వారికి ధన త్యాగాల వైపు శ్రద్ధ కనబర్చినప్పుడు వారు తమ ధనమును త్యాగమునకు సమర్పించెదరు. ఇదంతయు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం క్రమం తప్పకుండా మనకు ఇచ్చిన శిక్షణ ఫలితేమనని చెప్పవచ్చును. వివిధ సందర్భాలలో, వివిధ రకాలుగా, వివిధ ఉపదేశముల ద్వారా వారు మనకు ధన త్యాగపు ప్రాముఖ్యతను గూర్చి తెలియపర్చిరి. కావున ఒక సందర్భములో వారు ధన త్యాగమును గూర్చి తెలుపుచూ ఇట్లనిరి.

"ఈ ప్రపంచములో మానవుడు ధనమును అమితముగా ప్రేమించును. అందుకే (స్వప్నములో) ఒక వ్యక్తి తన కాలేయమును తీసి మరొకరికి ఇచ్చినట్లు చూచినచో అది ధనమని స్వప్నార్థ శాస్త్రములో వ్రాసి యున్నది. అందుకోసమే స్వచ్ఛమైన నిష్ఠాపరత, నిజమైన విశ్వాసమును పొందుటకు لَنْ تَنَالُوا الْبِرَّ حَتّٰى تُنْفِقُوْا مِمَّا تُحِبُّوْنَ అని తెలుపబడెను. అనగా అత్యంత ప్రీతికరమైన దానిని మీరు ధర్మ మార్గమున వినియోగించు నంత వరకు పుణ్యమును పొందలేరు. ఎందుకనగా దైవ ప్రాణులతో సానుభూతి, సత్ప్రవర్తనతో వ్యవహరించుటకు ధనమును అధికముగా ఖర్చు చేయవలసి యుండును." (ప్రజల హక్కులు చెల్లించుటకు వాస్తవానికి ధనము చాలా అవసరముండును) "మానవజాతి, దైవ ప్రాణుల పట్ల సానుభూతిని ప్రదర్శించడం విశ్వాసంలో రెండవ భాగము అనిపించు కొనును. ఇది లేనిదే విశ్వాసం పరిపూర్ణం, పటిష్టతకు చేరుకోలేదు." (ప్రజల హక్కులు కూడ విశ్వాసములో ఒక భాగము. ఇది లేనిదే విశ్వాసము పరిపూర్ణము కాదు, దృఢము కాదు, గట్టిపడదు.) "మానవుడు త్యాగము చేయనిదే ఇతరులకు ఏ విధముగా ప్రయోజనం చేకూర్చగలడు." (ఇతరులకు లాభము కలిగించుటకు, సానుభూతి కొరకు త్యాగము ఎంతో అవసరము.) "అందుకే ఈ సూక్తి لَنْ تَنَالُوا الْبِرَّ حَتّٰى تُنْفِقُوْا مِمَّا تُحِبُّوْنَ లో ఈ త్యాగాన్ని గూర్చిన బోధనలు, మార్గదర్శకాలను బోధించడం జరిగింది. కావున ధనమును ఖర్చు చేయుట కూడ మానవుని అదృష్టముగా, నిష్ఠాపరతకు ప్రామాణికముగా, ప్రేరణగా చెప్పుకో వచ్చును." (అనగా ధర్మబద్ధతకు

అదొక కోలమాణం) ఇట్లనిరి. "అబూబకర్ రజియల్లాహు తఆలా అన్హు జీవితములో దైవము కొరకు సమర్పణ త్యాగ ప్రామాణికమును మనము చూసినచో రసూలుల్లా సల్లల్లాహు అలైహి వసల్లం (ధర్మము కొరకు) పిలుపునివ్వగా వారు తమ ఇంట్లో ఉన్న సామాగ్రినంతయు సమర్పించిరి."

(మల్ఫూజాత్ సంపుటి 2, పుట 95-96 ఎడీషన్ 1985 ముద్రణ ఇంగ్లాండ్)

హజ్రత్ అబూబకర్ రజియల్లాహు తఆలా అన్హు చూపిన ఈ స్ఫూర్తి, ప్రామాణికమునే ఆ తరువాత హజ్రత్ ఉమర్ రజియల్లాహు తఆలా అన్హు చూపించిరి. అందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపిరి. హజ్రత్ అబూబకర్ రజియల్లాహు తఆలా అన్హు తన ఇంట్లో ఉన్న సామాగ్రినంతయు తీసుకొనివచ్చెను. హజ్రత్ ఉమర్ రజియల్లాహు తఆలా అన్హు తమ ఇంట్లో గల సగ భాగమును తీసుకొనివచ్చెను. ఆ విధముగా మిగిలిన అనుచరులు అందరు తమ తమ శక్తి సామర్థ్యములకు అనుగుణముగా త్యాగాలు చేసినారు.

(మల్ఫూజాత్ సంపుటి 2, పుట 95 ఎడీషన్ 1985 ముద్రణ ఇంగ్లాండ్)

ఈ స్ఫూర్తిని, ఈ ప్రామాణికమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనలో ఏర్పరచదలిచారు. నేను ముందుగా తెలిపినట్లు చాలా మంది అహ్మదీయులు ఈ త్యాగాల ఉన్నత ప్రామాణికమునకు చేరుటకు ప్రయత్నించారు. వారు పవిత్ర ఖుర్ఆన్, హదీసులను అదే విధముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఉపదేశములను చదివినప్పుడు వారిలో మనము దైవ మార్గములో ఖర్చు చేసినప్పుడు వారి ధన, ప్రాణములలో శుభములను అందించుననే నమ్మకం కూడ కలుగుతుంది. మానవుడు తన ప్రియమైన వస్తువును దైవమార్గములో ఖర్చు చేసినప్పుడు నేను అతనికి రెట్టింపు చేసి ఇచ్చెదనని, ఆ రెట్టింపు కూడ ఏడు వందల రెట్లు అధికముగా, అంతకు మించిన రెట్టింపును ఇస్తానని అల్లాహ్ తాలాయే తెలిపినాడు. అలా అహ్మదీయులు త్యాగాలు చేస్తున్నప్పుడు, అది కూడ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనములకు అనుగుణముగా ఖర్చు చేసిన పిదప, అల్లాహ్ తఆలా

తప్పకుండా రెట్టింపు చేసి ఇస్తాడు అనే నమ్మకం కలుగుతుంది. మనతో కూడ ఈ విధముగనే వ్యవహరించును. అందులో వారిట్లు తెలిపిరి. "తన కష్టార్జితంతో ఎవరైనా ఒక్క ఖర్జూరమును అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసినచో అల్లాహ్ పవిత్రమైన దానినే స్వీకరించును." ఇది గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయము. మోసం చేసి సంపాదించిన ధనమును అల్లాహ్ తఆలా స్వీకరించడు. అల్లాహ్ తఆలా కేవలం నీతివంతమైన సంపాదనతో చేయు దానమునే స్వీకరించును. వారిట్లు తెలిపిరి. "ఎవరైనా తన పవిత్ర కష్టార్జితమును దైవమార్గములో ఇచ్చినచో అల్లాహ్ తఆలా ఆ ఖర్జూరమునకు కుడి హస్తముతో స్వీకరించును. (అది ఖర్జూరమునకు సమానమైనను) దానిని పెంచును. తుదకు అది పర్వతము వలె అగును." ఇట్లనిరి. "మీలో ఎవరైనా ఒకరు ఒక చిన్న దూడను పోషించి దానిని పెద్ద పశువుగా చేయును."

(సహీ బుఖారి, కితాబుజ్జకాత్, అస్సదఖతు మన్ కసబ తయ్యబ్ ....... హదీస్ సంఖ్య 1410)

నేడు మనము ఈ విషయములను చదివినప్పుడు, విన్నప్పుడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనములను ఆలకించి నప్పుడు అవి కేవలం పురాణ కథనాలుగా కాకుండా నేడు త్యాగాలు చేయువారు వాటి శుభములను పొందుచున్నారని, స్వీయ అనుభూతిని పొందుచున్నారని తెలుసుకొందురు. ఇలా త్యాగములు చేయుచున్న వారి వనరులు పెరుగును, వారి విశ్వాసము కూడ పెరుగును. అందుకు సంబంధించిన కొన్ని సంఘటణలను నేను మీ ముందు ప్రస్తావించెదను.

ఆఫ్రీకాలో ఒక దేశమైన కేమరూన్ ప్రాంత ముబల్లిఘ్ గారిట్లు వ్రాసిరి. అక్కడ ఒక ముఅల్లిమ్ అబూబకర్ గారున్నారు. వారిట్లు తెలిపిరి. అబ్దుల్లాహ్ అనే ఒక అహ్మదియ్య యువకుడు గత కొన్ని సంవత్సరాలుగా నిరుద్యోగిగా జీవనం కొనసాగిస్తున్నాడు. వారు తన కుటుంబమును పోషించుకోలేని క్లిష్టమైనస్థితిలో ఉన్నాడు. ఆ పరిస్థితిలోనే ఒక రోజు వారు జుమా నమాజ్‌కు వచ్చిరి. జుమా నమాజ్ తరువాత తహ్‌రీకే జదీద్ కార్యదర్శి గారు చందా తహ్‌రీకే జదీద్‌ను

గూర్చి ప్రకటన చేసిరి. ఆ సమయములో అబ్దుల్లాహ్ గారి జేబులో పదివేల ఫ్రాంక్ సీఫా యుండెను. ఆ ప్రకటన విన్న వెంటనే తన వద్దనున్న ధనమునంతయు తహ్రీకే జదీద్ చందాలో చెల్లించిరి. కొన్ని రోజుల తరువాత వారు మరల సెంటర్‌కు వచ్చిన తరువాత ఇలా తెలిపిరి. అల్లాహ్ తఆలా నా చందాను స్వీకరించెను. ఒక వారం రోజులోనే ఒక ప్రైవేట్ కంపెని వారు నాకు ఉద్యోగము నిచ్చిరి. పైగా నా వేతనముగా నెలకు ఒక లక్ష ఫ్రాంక్ సీఫాను చెల్లించుటకు నిర్ణయించిరి. వేతనము నేను చెల్లించిన చందా కన్న పది రెట్లు ఎక్కువ. ఇది అల్లాహ్ తఆలా యొక్క ప్రత్యేక అనుగ్రహము. కావున నేను నా మొదటి నెల వేతనమును మరల చందా రూపంలో ఇచ్చుటకు ఇక్కడికి వచ్చాను అని తెలిపిరి. చూడండి వీరు పేదవారు. అయినా కూడ అల్లాహ్ తఆలా వీరికి ఏ విధముగా అనుభవమును, శుభములను కల్పిస్తున్నాడో ఒక్కసారి ఆలోచించండి. ఇలాంటి మరొక ఉదా॥ గలదు.

ఆఫ్రికాకు చెందిన కాంగో బ్రాజీల్ దేశమునకు చెందిన దావూద్ అనే ఒక నూతన అహ్మదీయుడు ఆర్థిక ఇబ్బందులలో చిక్కుకున్నాడు. చివరికి ప్రతి శుక్రవారమైన ఒక్కసారి అహ్మదియ్య మస్జిద్‌కు రాగలరని వారికి సూచించగా, వారు క్రమం తప్పకుండా జుమా నమాజ్‌కు రావడం ప్రారంభించిరి. ఒకరోజు జుమా తరువాత వ్యక్తిగత భేటిలో అతనికి ధన త్యాగపు ప్రాముఖ్యతను గూర్చి తెలియజేయుచు, అల్లాహ్ తఆలా మీకు ప్రసాదించిన దానిలో నుండి ఎంతో కొంత ధనమును దైవ మార్గములో ఖర్చు చేయుము, ఫలితముగా అల్లాహ్ తఆలా మీకు ఆ ధనమును రెట్టింపు చేసి ఇచ్చును అని అవగాహన కల్పించడం జరిగింది. న్యాయబద్ధమైన సంపాదనతో దైవ మార్గములో చేయు ఖర్చును అల్లాహ్ తఆలా రెట్టింపు చేసి ఇచ్చెదనని వాగ్దానము చేసెను. ఈ విధానము వలన నీ ఆర్థిక సంక్షోభం దూరమై, ఆదాయ మార్గాలు తెరుచుకొనును అని అతనికి నచ్చజెప్పి అతనికి తిరుగు ప్రయాణము కొరకు ఖర్చులు కూడ ఇచ్చాను అని ముబల్లిఘ్ గారు తెలిపిరి. ఒక వారం తరువాత మరల జుమా నమాజ్‌కు వచ్చినప్పుడు అతని ముఖం ఆనందంతో

వెలిగిపోసాగెను. అందుకు కారణమును అడిగి తెలుసుకోగా, గత వారం జుమా నమాజ్‌లో మీరు చందాలను గూర్చి ప్రేరణ కల్పించి నప్పుడు నేను జుమా నమాజ్ తరువాత మస్జిద్ నుండి బయటకు వెళ్ళక ముందే వంద ఫ్రాంక్ సీఫా చందాగా చెల్లించి వెళ్లితిని. చందా చెల్లించి నేను ఇంటికి చేరుకోగానే మా పొరుగు వారు ఒకరు నా ఇంటి ఆవరణలో ఉన్న పొయ్యి కట్టెలను పెట్టియుండెను. అకస్మాత్తుగా ఆ కట్టెలను తీసుకొనుటకు వచ్చెను. అతను పోయేటప్పుడు నాలుగు వేల ఫ్రాంక్ సీఫా నా చేతిలో పెట్టి వెళ్ళెను. నేను చందా చెల్లించి ఇంటికి చేరుకోగానే అల్లాహ్ తఆలా నలబై రెట్లు పెంచి నాకు ప్రతిఫలమును అందించినందుకు చాలా సంతోషం కలిగెను.

అదే విధముగా తన్జానియా అమీర్ గారు కూడ ఇలా వ్రాసిరి. ఉబైద్ కూాయీ గారు అనే ఒక నూతన అహ్మదీదియుడు తన వృత్తాంతమును ఈ విధముగా తెలిపెను. నేనొక తాపి మేస్త్రిని, గత 5 నెలల నుండి నాకు ఎలాంటి కూలి పనులు దొరకడం లేదు. చాలా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినవి. భార్యాపిల్లలు కూడ చాలా కష్టమును అనుభవించుచుండిరి. ఒకరోజు ముఅల్లిమ్ గారు చందాల ప్రాముఖ్యతను గూర్చి వివరించిరి. ఆ సమయంలో నాకు ఇంకా బాధ కలిగింది. ఎందుకనగా ఆ సమయములో నా వద్ద కేవలం ఆ ఒక్క రోజుకు సరిపడా సరుకులు కొనుగోలు చేయుటకు కావలసినంత డబ్బు మాత్రమే జేబులో గలదు. దైవ మార్గములో చందా చెల్లించినచో అల్లాహ్ తఆలా శుభము కల్గించునని ముఅల్లిమ్ గారు చెప్పినందున నేను ఆ నగదును చందాలో చెల్లించాలని నిర్ణయించుకొంటిని. కావున ఆ నిర్ణయము ప్రకారమే నేను చందా చెల్లించాను. అనంతరం నా పిల్లలు ఏమి భుజింతురు అనే ఆలోచన నాకు కలిగింది. ఇలా నేను ఆలోచించుచుండగానే ఒక చోట నిర్మాణ పనులు జరుగుచున్నాయని, వెంటనే అక్కడికి వెళ్ళి కొలతలు తీసుకోవాలని సమాచారం అందెను. ఆ తరువాత కూలీ క్రింద ముందస్తుగా నాకు అతడు కొంత నగదు కూడ ఇచ్చెను. వాస్తవానికి గత ఐదు నెలలుగా నేను ఇబ్బందులను

ఎదుర్కొంటున్నాను. కాని దైవ మార్గములో నేను చందా ఇవ్వగానే శుభముల ద్వారములు తెరుచుకున్నవి. ఈ విషయముతో నేను చాలా ఆశ్చర్యమునకు గురైనాను. ఆ నాటి నుండి అనగా నేను చందా చెల్లించిన నాటి నుండి నా పరిస్థితులే మారిపోయాయి. ఇక ముందు నేను చందా చెల్లించుటలో ఎన్నడు వెనుకాడను.'' అల్లాహ్ తఆలా నూతన అహ్మదీయులకు కూడ ఇలాంటి అనుభూతులను చూపించుచుండును.

ఆఫ్రికా ఖండములోని మాలి అనే దేశములో లాసీన (Lassina) అనే ఒక నూతన అహ్మదీ ఉండేవారు, వారికి మూడు, నాలుగు సంవత్సరాల క్రితం బైఅత్ చేయు అదృష్టం దక్కింది. అతడు తన సాధారణ ఆదాయముతో కూడ ఐదు వందల ఫ్రాంక్ సీఫా చందాగా చెల్లించడం జరిగింది. అతడు ఇట్లు తెలిపెను. "అహ్మదియ్య జమాఅత్ లో చేరుటకు, చందాలు చెల్లించుటకు ముందు నా వ్యాపారం మంచిగా కొనసాగేది కాదు. కాని చందా చెల్లించిన పిదప దాని శుభముల వలన నా వ్యాపారము లాభధాయకముగా కొనసాగడం మొదలయ్యెను.'' ప్రస్తుతం వారు వసియ్యత్ కూడ చేశారు, (గతంలో వారు తహ్రీకే జదీద్‌లో ఐదు వందల ఫ్రాంక్ సీఫాలు చందాగా చెల్లించారు) కాని నేడు వారు నెలకు ముప్పది ఐదు వేల ఫ్రాంక్ సీఫాలు చందగా చెల్లించు చున్నారు. అతని అహ్మదియేతర ముస్లిం బంధువులు అతని వ్యాపారమును చూచి బహుశ జమాఅత్ అతనికి ఆర్థిక సహాయం చేయుచున్నదని భావించుచున్నారు.

ఫ్రాన్స్ నుండి మరొక నూతన అహ్మదీయుడు హంజా గారిట్లు వ్రాసిరి. బైఅత్ చేసిన తరువాత నాకు జమాఅత్ చందా వ్యవస్థ గురించి తెలిసినప్పుడు నా ఆర్థిక పరిస్థితిని చూసుకున్నచో చాలా బలహీనముగా కనిపించసాగెను. నా వద్ద చందా చెల్లించుటకు కూడ ఏమాత్రం డబ్బు లేకుండెను. కాని చందా చెల్లించడం ద్వారా ఎన్నో శుభములు కలుగుతాయని, బదులుగా అల్లాహ్ తఆలా ఎన్నో రెట్లు అధికముగా పెంచి తిరిగి ఇచ్చునని నా అహ్మదీయ మిత్రులు కొందరు తెలిపిరి. ఆ సమయములో నా వద్ద కేవలం 60 యూరోలు మాత్రమే యుండెను.

వాటిని దైవ మార్గములో చందాగా చెల్లించెదనని నేను నిర్ణయించుకొంటిని. మిగతా విషయములను గూర్చి తరువాత ఆలోచించెదమని భావించుకొంటిని. మరల వారిట్లనిరి. నేను చందా చెల్లించి కేవలం కొన్ని రోజులు కూడ గడవకుండానే నా బ్యాంక్ స్టేట్‌మెంట్ మా ఇంటికి వచ్చినది. దానిని పరిశీలించి చూడగా ఎక్కడి నుండో నా బ్యాంక్ ఖాతాలోకి ఆరు వందల యూరోలు వచ్చినట్లు గమనించితిని. ఈ విషయము గూర్చి విచారించగా ప్రభుత్వం నాకు గతంలో ఆరు వందల యూరోలు ఇవ్వవలసి యుండెను. కాని రికార్డులో నమోదు కానందున ఆలస్యమైనదని తెలిసినది. ఈ విధముగా నేను చందాలో చెల్లించిన నగదు కంటే ఎన్నో రెట్లు అధికముగా నా ఊహకందని విధముగా అల్లాహ్ తాలా పెంచి నాకు తిరిగిచ్చెను.

తన్జానియా అమీర్ గారు మరల ఇట్లు వ్రాసిరి: డొడోమ (Dodoma) ప్రాంతానికి చెందిన అహ్మద్ సాని గారు వసియ్యత్ కూడ చేశారు. వారు తన చందా వాగ్దానముగా 50 వేల షిలాంగ్ వ్రాయించిరి. పైగా తన వాగ్ధానమును తొలి రోజులలోనే చెల్లించెను. గత నెల వారు నన్ను స్వప్నములో చూచిరి. ఆ స్వప్నములో నేను వారింటికి వెళ్లాను, ఆ తరువాత నీవు భూమిలో నుండి బంగారమును వెలికి తీయుదువా? అని నేను అతనిని ప్రశ్నించగా, అవును కాని నా ఈ వృత్తి సరిగ్గా నడవడం లేదని అతడు నాకు సమాధానమిచ్చెను. అందుకు నేను అతని వైపు చూశాను, ఇంతలో ఎక్కడి నుండో తహ్‌రీకే జదీద్ చందా వాగ్దానమును పెంచుము అని శబ్దము వినిపించెను. సాని గారు ఆయుర్వేద మందులను కూడ తయారు చేస్తారు, ఇందులో వారికి చాలా ప్రావీణ్యం గలదు. మరల వారిట్లు తెలిపిరి. ఈ స్వప్నము తరువాత అల్లాహ్ తఆలా వారి హస్తములో అసాధారణమైన స్వస్థతను ప్రసాదించెను. గత నెల నుండి వారి వద్దకు చాలా దూరం నుండి చికిత్స చేయించుకొనుటకు ప్రజలు వచ్చుచున్నారు. ఆదాయం కూడ అసాధరణముగా వృద్ధి చెందినది. మరల ఇట్లనిరి: ఆ స్వప్నం తరువాత అతను గత నెలలో నాలుగు లక్షల ఇరవై ఏడు వేల షిలాంగ్‌లను

చందా తహ్‌రీకే జదీద్‌లో చెల్లించెను. ప్రస్తుతం ఆ ప్రాంతములో వారే అందరి కన్నా ఎక్కువగా చందా చెల్లించుచున్నారు.

భారతదేశములోని బెంగళూర్‌లో విధేయులైన ఒక నవ యువకుడు నిరుద్యోగిగా యుండెను. ఉద్యోగము లేనందున నెల వారి తమ ఇంటి కిస్తును కూడ చెల్లించలేక పోవుచుండిరి. తహ్‌రీకే జదీద్ ఇన్స్‌పెక్టర్ గారిట్లు తెలిపిరి. నేను వారింటికి వెళ్లితిని, కాని తహ్‌రీకే జదీద్ కార్యదర్శి వారి పరిస్థితులను గూర్చి నాకు తెలిపినందున నేను మౌనం పాటించుచు కూర్చొని యుంటిని. కాని వారే మీరు నాతో ఏదో మాట్లాడదలుచుకున్నారు, అదేమిటి అని స్వయముగా నన్ను ప్రశ్నించెను. అందుకు నాకు మీ పరిస్థితులను గూర్చి పూర్తిగా తెలియనందున తహ్‌రీకే జదీద్‌లో ఒక లక్ష రూపాయలను చందాగా వాగ్దానము వ్రాయించాలని నేను ఆలోచించిచ యుంటిని. కాని నాకు ఇప్పుడు మీ పరిస్థితులను గూర్చి తెలిసింది. కావున నేను మౌనం పాటించితిని. ప్రస్తుతం మీరు మీ స్థోమత ప్రకారం చందా వ్రాయించండి అని సమాధానం ఇచ్చాను. అందుకు వారు నాకు అల్లాహ్‌పై పూర్తి విశ్వాసం గలదు. నేను నా వాగ్దానమును ఇన్షా అల్లాహ్ తప్పకుండా చెల్లించెదను. కావున మీరు లక్ష రూపాయాలను చందాగా వ్రాసుకోగలరని నాకు సమాధానమిచ్చిరి. ఆ తరువాత కొన్ని రోజులకే అల్లాహ్ తఆలా వారిని కరుణించెను. మరల అతనికి ఒక మంచి ఉద్యోగం వచ్చింది. గత సంవత్సరపు చందాతో పాటు ఈ సంవత్సరపు చందాను కూడ వారు పూర్తిగా చెల్లించిరి.

మాయూటి అనే ఒక ద్వీపము గలదు, అది అతి పేద దేశముగా గుర్తింపు పొందింది. అక్కడి ప్రజలు కూరగాయలు సాగుచేసి వాటిని విక్రయించుకుంటు తమ జీవితమును అతికష్టముగా కొనసాగిస్తున్నారు. అక్కడి నుండి మన ముబల్లిఘ్ గారు ఈ విధముగా వ్రాసిరి. రాబీన్ (Rabion) గారు అనే మన అహ్మదియ్యా మిత్రుడు ఒకరు మోటర్ సైకిల్ దుకాణంలో పని చేస్తుంటాడు. అక్కడి అహ్మదీయులలో అందరి కంటే ఎక్కువ చందాను వారే చెల్లించుచున్నారు. వారు ఇలా

తెలియపర్చిరి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటనగా నేను ఎంత చెందా చెల్లించినను ఆ నెల చివరలో అది రెట్టింపై నా వద్దకు చేరుతుంది. ఒకరోజు వారి భార్య మీరు ఇంత పెద్ద మొత్తములో చందా ఎందుకు చెల్లించుచున్నారు అని వారిని ప్రశ్నించెను. అందుకు వారు అల్లాహ్ తఆలా నేను ఇచ్చిన చందాను రెట్టింపు చేసి ఇస్తున్నందున నేను ఇంత పెద్ద మొత్తములో చందా చెల్లించుచున్నానని సమాధానమిచ్చిరి. ఆ తరువాత వారు వారి శ్రీమతి సమక్షములో కొంత డబ్బును చందాగా చెల్లించుచు, నెల ముగియక ముందు ఇందుకు రెట్టింపు డబ్బు తిరిగి వచ్చును, చూడుమని చెప్పెను. చివరికి అలానే జరిగింది. చివరికి దుకాణం యజమాని కార్మికులందరికి ప్రోత్సాహకంగా కొంత డబ్బును అదనంగా ఇచ్చెను. ఈ విధముగా వీరికి ప్రోత్సాహకముగా లభించిన డబ్బు వారు చెల్లించిన చందాకు రెట్టింపు నగదై యుండెను. ఈ విధముగా వారు అల్లాహ్ తఆలా అనుగ్రహముతో రోజు రోజుకు చందాను పెంచుకుంటూ పోవుచున్నారు.

కెనడా అమీర్ గారు ఇలా వ్రాసిరి. లజ్నా ఇమాఇల్లాహ్ తహ్‌రీకే జదీద్ కార్యదర్శి గారు కెనడా మహిళలకు, హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్హు తహ్‌రీకే జదీద్ ప్రారంభించినప్పుడు చేసిన ఉపదేశానుసారం తమ నెలసరి ఆదాయములో సగం లేదా ఒక నెల ఆదాయమునంతయు తహ్‌రీకే జదీద్‌కు చందా రూపకం లో చెల్లించమని ప్రోత్సహించిరి. ఫలితముగా పార్ట్ టైమ్ ఉద్యోగం చేయుచున్న ఒక సోదరి తనకు పూర్తి టైం ఉద్యోగం లభించినచో ఒక నెల వేతనమంతయు చందాలో చెల్లించెదనని ఆకాంక్ష ఉన్నందున వారికి పూర్తి టైం ఉద్యోగం లభించెను. నెలకు ఐదు వేల డాలర్లు వేతనముగా నిర్ణయించబడెను. వారు ఆ జీతమునంతయు తహ్‌రీకే జదీద్ చందాలో చెల్లించిరి. ఇలాంటి ఉదాహరణలు అనేకము గలవు.

అల్లాహ్ తఆలా కృపానుసారం అహ్మదియ్యా జమాఅత్ స్థాపించబడినప్పటి నుండి నేటి వరకు ఎంతో మంది స్వచ్ఛత కలిగిన అహ్మదీయులు వారు (జన్మతః లేదా) పూర్వపు అహ్మదీయులైనను,

నూతన అహ్మదీయులైనను, లేదా ఇప్పుడిప్పుడే జమాఅత్ శిక్షణను నేర్చుకుంటున్న అహ్మదీయులైనను అల్లాహ్ తఆలా వ్యవహారము, వాగ్దాన అనుభూతిని ప్రతి ఒక్కరు పొంది యున్నారు. వారిలోని త్యాగ స్ఫూర్తిని నేను మీ ముందు ప్రస్తావించాను. నేటి కాలంలో ఆర్థిక త్యాగాలలో కూడ అహ్మదియ్య జమాఅతే ఒక ప్రత్యేక స్థానమును సంతరించుకొన్నది. నేటి కాలం ఇస్లాం ప్రచారాన్ని పరిపూర్ణం చేయు కాలమని, ఇందుకై అల్లాహ్ తఆలా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను అవతరింపజేసినాడనే విషయం అహ్మదీయులలో అధికులకు తెలుసు. ఈ కార్యము పవిత్ర ఖుర్ఆన్‌ను, దాని అనువాదమును వివిధ భాషలలో ప్రచురించడం ద్వారా నెరవేరుచున్నది. అదే విధముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకముల ప్రచురణ, లిటరేచర్ ముద్రించడం ద్వారా పూర్తి అగుచున్నది. మస్జిద్‌లను నిర్మించి, ప్రచార కేంద్రములను ఏర్పాటు చేయడం ద్వార, ధార్మిక విద్యా కేంద్రాలను స్థాపించడం ద్వార నెరవేరుచున్నది. నేడు ఆసియా ఖండములో, యూరప్‌లో, ఆఫ్రికా ఖండంలో, ఉత్తర అమెరికాలో, ఇండోనేషియాలో కూడ జమాఅతులను ఏర్పాటు చేయడమైనది. ఇక్కడి నుండి విద్యాభ్యాసం పూర్తి చేసుకొని వెళ్లిన ముబల్లిఘ్‌లు, మురబ్బీలు ఇస్లాం ప్రచార కార్యక్రమాలలో నిమగ్నమై యున్నారు. ఈ విషయములన్నియు అహ్మదీయులకు తెలిసినప్పుడు, వీటిని నెరవేర్చుటకు ధన త్యాగము చేయవలసి యుండునని వారికి అవగాహన కల్పించినప్పుడు వారు తప్పకుండా ధన త్యాగాలలో కూడ ముందుకు వచ్చెదరు. అంతేగాకా మానవజాతి పట్ల సానుభూతి చూపడం కూడ విశ్వాస సూత్రములోని ఒక భాగమేనని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకు బోధించిరి. ఈ సానుభూతిని చూపడం కొరకు పాఠశాలలను, ఆసుపత్రులను కూడ ఏర్పాటు చేయవలసి యుండును. ఇవియే గాకా వివిధ ప్రాంతాలలో సహాయక చర్యల వ్యవస్థను కూడ ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమములన్నియు కేవలం స్వచ్ఛత గల అహ్మదీయుల త్యాగాల వల్లనే సాధ్యమగుచున్నాయి.

వారి త్యాగాలకు ప్రతిఫలమును ఇన్షా అల్లాహ్ తఆలా, ఈ ప్రపంచము లో, పరలోకములో కూడ అల్లాహ్ తఆలా నిచ్చును అనే విశ్వాసమును కూడ ఈ త్యాగాలు చేయువారు కలిగి యున్నారు. కాని ఎక్కడైనా ఏదైనా లోటు యున్నచో అది కేవలం నిర్వాహకుల వద్దనే గలదని వారు ప్రత్యేక శ్రద్ధను కనబర్చినచో ఆ లోటు కూడ పూర్తి అగునని తెలియుచున్నది. ఒకవేళ వారు శ్రద్ధ చూపినచో అహ్మదీయులకు కూడ ఆసక్తి పెరుగుతుంది. శ్రద్ధను కనబర్చు విషయమును గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సందర్భమున ఇట్లనిరి.

"మన జమాఅత్ నిర్వాహణకు చందాల ఆవశ్యకత గలదని ఇప్పటి వరకు కూడ జమాఅత్ సభ్యులకు తెలియజేయలేదని నేను ఊహించుచున్నాను. అధికులు బైఅత్ చేసి రోధించుకుంటు వెళ్ళుతారు, ఒకవేళ వారికి చందా ప్రాముఖ్యతను గూర్చి తెలియజేసినచో వారు తప్పకుండా చందాలు చెల్లించెదరు. కాని వారికి తెలియజేయవలసి ఉన్నది. ఆర్థికంగా వెనుకబడిన సోదరులను కూడ చందా వ్యవస్థలో భాగస్వాములను చేయుగలరు." (ఒకరు మరొకరికి చెప్పవలెను)

(మల్ఫూజాత్ సంపుటి 6, పుట 41 ఎడీషన్ 1985 ముద్రణ ఇంగ్లాండ్)

ఈ విషయంను నేడు కూడ ఆచరించవలసి యున్నదని నేను తెలియజేయుచున్నాను. శ్రద్ధ చూపించినప్పుడే ప్రజలలో ఆసక్తి పెరుగుతుంది. ఈ క్రమంలోనే నేను తహ్రీకే జదీద్, వఖ్ఫె జదీద్ చందా చెల్లించువారి సంఖ్యను పెంచగలరని ఆదేశించిన పిదపయే వారి సంఖ్య గణనీయముగా పెరిగింది. ఈ విధముగా అహ్మదియ్యా బాల బాలికలలో కూడ త్యాగ స్ఫూర్తి గలదనే విషయం కూడ మనకు ఎంతో స్పష్టముగా అర్థమగుచున్నది.

అదే విధముగా కెన్యా దేశానికి చెందిన నికోరో జమాఅత్ అధ్యక్షులు, ప్రస్తుతం కెన్యా డిఫెన్స్ ఫోర్స్‌లో సర్జన్‌గా బాధ్యతలు నిర్వహించుచున్నటువంటి అబూబకర్ కేబి గారిని గూర్చి కెన్యా మురబ్బి గారు ఇలా వ్రాసిరి. వీరు చాలా విధేయుత గల అహ్మదీయులు. మస్జిద్ నుండి చాలా దూరములో గల వీరి సైనిక స్థావరం నుండి ప్రతి

శుక్రవారం జుమా నమాజ్‌కు వస్తుంటారు. అంతేగాకా వారితో పాటు వారి ముగ్గురు కుమార్తెలను కూడ తీసుకొని రావడనికి ప్రయత్నించు చుంటారు. వారి సైనిక స్థావరంలో ప్రత్యేకించి ఎం.టి.ఏ డిష్ కూడ ఏర్పాటు చేసుకున్నారు. స్వయముగా వారు కూడ వారితో పని చేయు చున్నటువంటి వారి మిత్రులకు కూడ వారు ఎం.టి.ఏ కార్యక్రమాలను చూపిస్తూనే ఉంటారు. మరల వారిట్లు తెలిపిరి. గత కొన్ని జుమాలలో నేను తహ్రీకె జదీద్ చందా ప్రాముఖ్యతను గూర్చి ప్రస్తావించుచు వచ్చాను. కొన్ని రోజుల క్రితం, జుమా నమాజ్ తరువాత వారు మురబ్బి గారితో నా కుమార్తెలు కూడ ఈ జుమా ప్రసంగమును వింటున్నారు. గడిచిన నెలలో ఒక అతిథి మా ఇంటికి రావడం జరిగింది. అతడు వెళ్ళుచూ ఇరవై ఐదు ఫిలాంగ్ రూపాయలను ఐదు సంవత్సరాల వయస్సుగల నా చిన్న కూతురికి అయినా సమీరా చేతికిచ్చి వెళ్ళెను. ఆ అతిథి వెళ్ళగానే ఆ అమ్మాయి 20 షిలాంగ్ రూపాయలను నా చేతిలో పెట్టి ఈ డబ్బును తహ్రీకె జదీద్ చందాలో చెల్లించమని మిగిలిన ఐదు షిలాంగ్‌లతో ఏమైనా తినుభండరాలు కొనుగోలు చేయుదును అని అన్నట్లుగా తెలిపిరి.

మరల లైబీరియా నుండి ముబల్లిఘ్ గారు ఇలా వ్రాసిరి. తహ్రీకె జదీద్ చందా వసూలు చేయుచు మాగీమా (Magima) అనే జమాఅత్‌లోని ఒక ఇంటికి చేరుకున్నాము. తహ్రీకే జదీద్ చందా ఆవశ్యకతను గూర్చి వారికి వివరించుచు, అందులో చిన్నలు పెద్దలు, అందరు భాగాస్వాములు కావచ్చునని, తమ శక్తి సామార్థ్యములకు అనుగుణముగా అందులో చందా ఇవ్వవచ్చునని కూడ తెలుపడం జరిగింది. ఆ ఇంట్లో గల ఆరు లేదా ఏడు సంవత్సరాల బింటోసమావేర (Binto Samawera) అనే ఒక అమ్మాయి, చిన్న చిన్న వస్తువులను బుట్టలో వేసుకొని విక్రయించేది, మా సంభాషణలు వినగానే ఆ అమ్మాయి మా లాంటి చిన్న పిల్లలు కూడ అందులో పాల్గొనవచ్చునా? అని ప్రశ్నించగా, పాల్గొనవచ్చును అని సమాధానం ఇవ్వడం జరిగింది. అందుకు ఆ అమ్మాయి ఇంట్లోకి పరుగెత్తికెళ్ళి 20 లైబీరియన్

డాలర్‌లను తీసుకొచ్చి ఇచ్చుచు నా వద్ద ఇంతే మొత్తము గలదు. కావున నన్ను కూడ చేర్చుకోగలరని ఆ మొత్తమును చందాగా ఇచ్చినది. ఆ అమ్మాయి అమాయకత్వపు పనిని చూసి వారి తల్లిదండ్రులు కూడ చందా చెల్లించిరి.

ఇలాంటి త్యాగములు చేయు ప్రత్యేకత కేవలం అహ్మదీయులకే గలదు. వారు చిన్నవారైనను, పెద్దవారైనను, ప్రపంచములో ఏ ప్రాంతములో ఉన్నవారైనను ఆదర్శవంతులుగా నిలిచెదరు. పిల్లల త్యాగ స్ఫూర్తి వాస్తవానికి వారి మనస్థత్వపు ఉపేక్షకు పిలుపు వంటింది. కేవలం అల్లాహ్ ప్రీతి కొరకు తమ వాగ్దానాలను పూర్తి చేయుచూ త్యాగాలు చేయు ఉత్సాహం గల చిన్న వారిని, పెద్ద వారిని ప్రళయ దినము వరకు అల్లాహ్ తాలా జమాఅత్‌కు అనుగ్రహించు గాక! (ఆమీన్)

సాంప్రదాయం ప్రకారం నవంబర్‌లో తహ్‌రీకె జదీద్ నూతన సంవత్సర ప్రకటన వెలువడుతుంది. కావున నేడు నేను తహ్‌రీకె జదీద్ 84వ సంవత్సరపు ఆరంభమును ప్రకటించుచున్నాను. గత సంవత్సరపు కొన్ని వివరములను కూడ నేను వివరించెదను. తహ్‌రీకె జదీద్ 83వ సంవత్సరము ముగిసిపోయి 84వ సంవత్సరము నేను ముందుగా తెల్పినట్లుగా నవంబర్ ఒకటవ తేది నుండి ప్రారంభమగును. ఇప్పటి వరకు అందిన నివేదికల ప్రకారం తహ్‌రీకె జదీద్ ఆర్థిక త్యాగాలలో ఒక కోటి 25 లక్షల 80వేల పౌండ్లను త్యాగము చేయు అనుగ్రహము జమాఅత్ సభ్యులకు లభించెను. అల్‌హంద్‌లిల్లాహ్. గత సంవత్సరము తో పోల్చి చూసినచో అల్లాహ్ తఆలా అనుగ్రహము వలన 15 లక్షల 43 వేల పౌండ్లు అధికం. దేశాల వారిగా చూసినచో పాకిస్తాన్‌ను మినహాయించగా, మొదటి స్థానంలో జర్మని, రెండవ స్థానంలో ఇంగ్లాండ్, మూడవ స్థానంలో అమెరికా, నాలుగువ స్థానంలో కెనడా, ఐదవ స్థానంలో భారత్, ఆరవ స్థానంలో ఆస్ట్రేలియా, ఏడవ స్థానంలో ఇండోనేషియా, ఎనిమిదవ స్థానంలో మిడిల్ ఈస్ట్, తొమ్మిదవ స్థానంలో మరో మిడిల్ ఈస్ట్ పదవ స్థానంలో ఘానా నిలిచెను.

తలసరి చందా చెల్లింపుల ప్రకారం మొదటి, రెండవ స్థానాలను

కూడ మిడిల్ ఈస్ట్ జమాఅత్‌లు పొందగా ఆ తరువాత క్రమంగా, స్విట్జర్‌ల్యాండ్, ఇంగ్లాండ్, కాని యు.కే యొక్క సంఖ్య జల్సా సాలాన యు.కేలో పాల్గొనేవారి సంఖ్య కన్న తక్కువగా పేర్కొనడం జరిగింది. వాస్తవానికి జల్సాలో కూడ ఇంగ్లాండ్‌లో ఉన్న వారందరు పాల్గొనరు. దీని అర్థం ఏమిటనగా, ఈ అంశంలో ఇక్కడ ప్రత్యే శ్రద్ధ చూపడం లేదని అర్థమగును. ఐదవ స్థానంలో అమెరికా, ఆరవ స్థానంలో ఆస్ట్రేలియా, ఏడవ స్థానంలో జర్మని. జర్మనిలో కూడ జల్సా సాలానలో పాల్గోనే వారి సంఖ్యకు సమీపంలోనే చందా దారుల సంఖ్య గలదు. దీని అర్థం అక్కడి జాతీయ, ప్రాంతీయ కార్యదర్శులు సభ్యులందరిని భాగస్వాములను చేయుటలో చాలా వరకు ప్రయత్నించారు. ఎనమిదవ స్థానంలో స్వీడన్, తొమ్మిదవ స్థానంలో నార్వే, పదవ స్థానంలో కెనడా నిలిచెను.

ఆఫ్రీకా దేశాలలో జాతీయ స్థాయిలో చందా చెల్లింపుల నివేదికను చూసినచో ఘూనా, నైజేరియా, ఆ తరువాత మాలి, కెమ్రోన్, లైబీరియా, ఆ తరువాత బెనిన్ గలవు.

డబ్బులు అవే ప్రోగు అగును కాని ముందుగా చందాలో అధిక సభ్యులను భాగాస్వాములను చేయుమని నేను గత కొన్ని సంవత్సరాలుగా తెలుపుచున్నాను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చివరికి అది ఒక్క పైసా అయినా కూడ, ప్రతి ఒక్కరి దగ్గరి నుండి తప్పక వసూలు చేయమని తెల్పిరి. ఏ విధముగానైతే ఒక్కొక్క చుక్కతో సముద్రం ఎలా ఏర్పడుతుందో అదే విధముగా ఒక్కొక్క పైసాతోనే చాలా పెద్ద మొత్తం ప్రోగు అవును.

(మల్ఫూజాత్ సంపుటి 6, పుట 40, సూచన ఎడీషన్ 1985 ముద్రణ ఇంగ్లాండ్)

మొత్తానికి నేను చందా దారుల సంఖ్యను కూడ పెంచమని సూచించాను. అల్లాహ్ తఆలా అనుగ్రహము వలన ఈ సంవత్సరము 16 లక్షలకు పైగానే చందా దారులు పాల్గొన్నారు. నూతనముగా పాల్గొన్న వారి సంఖ్య రెండు లక్షలకు పైనే యున్నది. ఈ క్రమములో ఆఫ్రికా ఖండంలో ఒక్క నైజేరియాలోనే యాభై ఏడు వేల మంది నూతన

అహ్మదీయులు పాల్గొనగా, కేమూరున్‌లో 30 వేల మంది నూతన అహ్మదీయులు పాల్గొన్నారు. ఆ తరువాత బెనిన్, ఆయివరి కోస్ట్, నైజీర్, గని కనాకరి, గేంబియా, సెనిగాల్, బుర్‌కీనా ఫాసు దేశాలు చెప్పుకోదగినవి. ఆఫ్రికా యేతర దేశాలలో ఇండోనేషియా, జర్మని, ఇంగ్లాండ్, భారత దేశం, అమెరికా, కెనడా వంటి దేశాలలో కూడ చందా దారుల సంఖ్య గణనీయముగా పెరిగింది. అయినా కూడ చందాలో పాల్గొనని జమాఅత్ సభ్యులు ఇంకా యున్నారు. వారిని కూడ భాగస్వాములను చేయడం వైపు ప్రత్యేక శ్రద్ధ చూపవలసిన అవసరం ఎంతైనా గలదు.

పాకిస్తాన్‌లో అక్కడి నిర్వాహణ వ్యవస్థలో మార్పులు రావడం జరిగింది. అందుకోసము జిల్లాల వారిగా కాకుండా పట్టణాల ప్రకారం నివేదికను తయారు చేయడం జరిగింది. ఆ నివేదిక ప్రకారం, రబ్వా మొదటి స్థానంలో ఉండగా, ఇస్లామాబాద్, లాహోర్ నగరం, అజీజా బాద్ కరాచి, ఢిల్లీ గేట్ లాహోర్, రావల్ పిండి, ముల్తాన్ , పిషావర్, కోయిటా, గుజ్రాన్‌వాలా తదుపరి స్థానాలను వరుసగా సాధించెను.

జిల్లాల వారీగా త్యాగాలు అధికముగా చేయు జిల్లాల పేర్లు ఈ విధముగా గలవు. అవి సర్గోధా, ఫైసలాబాద్, ఉమర్ కోట్ నెం 3, గుజ్రాత్ నెం 4, రావల్ పిండి నెం 5, హైదారాబాద్ నెం 6, మీర్‌పూర్ నెం 7, బహావల్‌పూర్, ఓకాడా నెం 8, ఈ రెండు జిల్లాలు సమాన స్థానమును పొందినాయి. టోబాటేక్ సింగ్ నెం 9, కోటిలి కాశ్మీర్ (పాకిస్తాన్) నెం 10.

జర్మనికి చెందిన మొదటి 10 జమాఅత్‌లు ఈ విధముగా గలవు. నోయిస్ నెం 1, ఆ తరువాత రోయిడ్ మార్క్, ఆ తరువాత వాయిన్ గార్టన్, నేడా, పన్నే బర్గ్, మహది ఆబాద్, హైడిల్ బర్గ్, లంబర్గ్, కీల్ మరియు ఫ్లోర్జ్ హామ్, వారి పది పెద్ద జమాఅత్‌లు ఇలా గలవు. హంబర్గ్, ఫ్రాంక్‌ఫోర్గ్, మోయిర్ ఫిలడన్, గ్రాస్ గ్రావ్, వేజ్‌బాదన్, డసన్ బాఖ్, మిన్ హాయిమ్, రెడ్ షెటర్డ్, డ్రామ్ షెటర్డ్, మరియు ఓ ఫెన్ బాఖ్.

చెల్లింపుల విషయంలో ఇంగ్లాండ్‌లోని 10 పెద్ద జమాఅత్‌లు ఇట్లు గలవు. మొదటి స్థానంలో మస్జిద్ ఫజల్, వేస్టర్ పార్క్, మింఘమ్ సౌత్, బ్రెడ్ పోర్ట్ నార్త్, పటిని, గ్లాస్‌గో, ఇస్లామాబాద్, న్యూమాలడన్, జలంకం, సకన్‌త్రోప్.

వ్యక్తిగత చెల్లింపుల దృష్ట్యా ప్రాంతాల వారీగా చూసినచో, సౌత్ ఈస్ట్ నెం 1 కాగా నార్త్ ఈస్ట్ నెం 2, ఇస్లామాబాద్ నెం 3, మాడ్‌లెండ్ నెం 4, స్కాట్ ల్యాండ్ నెం 5.

అమెరికాకు చెందిన 10 జమాఅత్‌లు ఈ విధముగా గలవు. సెలికోన్ వ్యాలి నెం1, (Oshkosh) ఓష్ కోస్ నెం 2, (Seattle) సైటెల్ నెం 3, డెట్రైట్ నెం 4, యార్క్ నెం 5, లాస్ ఎంజిల్ ఈస్ట్ నెం 6, సిలవర్ సుపర్ నగజ్ నెం 7, షికాగో సౌత్ వెస్ట్, అట్లాంటా, లాస్ ఎంజిల్స్ ఇన్‌లాండ్స్.

వసూలు ప్రకారం కెనడాలోని ప్రాంతీయంగా చూసినచో వాన్ ఒకటో స్థానంను, ఆ తరువాత పీస్ విలేజ్, బ్రామ్‌టన్, విక్‌నోర్, మసి సాగా.

భారతదేశములోని మొదటి పది జమాఅత్ (రాష్ట్రాల వారీగా) ఈ విధముగా గలవు. కేరళ, కర్ణాటక, జమ్మూ కాశ్మీర్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, పంజాబ్, బెంగాల్, ఢిల్లీ, మహారాష్ట్ర.

పది పెద్ద జమాఅత్‌లు ఇట్లు గలవు. (1) కాలికట్ (కేరళ), (2)పత్తాపిరియమ్ (కేరళ), (3) ఖాదియాన్ (పంజాబ్). (4) హైద్రాబాద్ (తెలంగాణ), (5) కలకత్తా (బెంగాల్), (6) కెన్నానూర్ టౌన్ (కేరళ), (7) పైంగాడి (కేరళ), (8) మాథోటమ్ (కేరళ), (10) కరులాయి (కేరళ).

ఆస్ట్రేలియాలోని మొదటి పది స్థానాలను సాధించిన జమాఅత్ లు ఈ విధముగా గలవు. కాసిల్ హిల్, మెల్‌బోర్న్, బేర్‌విక్, (Act) ఏక్ట్ కెనిజా, మార్జడన్ పార్క్, బ్రెజ్‌బీన్, లూగన్, ఎడ్‌లిడ్ సౌత్, పిలంప్‌టన్, మెల్‌బోర్న్ లాంగ్ వారిన్, పిజిత్, మెల్‌బోర్న్ ఈస్ట్.

అల్లాహ్ తఆలా వీరందరి ధనము, కుటుంబములో అనంత

శుభములు కలుగజేయును గాక! (ఆమీన్).

దీని తరువాత నేను మరొక ఉద్యమము మరియు ప్రకటన గూర్చి మీకు తెలుపదలచితిని. ఈ ప్రకటన స్థోమత గల UK వాసుల కోసం ప్రత్యేకముగా, ప్రపంచ అహ్మదీయుల కోసం పుణ్యఫల దాయునిగా యుండును. ఆ ప్రకటన ఏమిటనగా మస్జిద్ బైతుల్ ఫుతూహ్ కాలిపోయిన భాగంను పునర్ నిర్మించాలనే విషయంను గూర్చి ఈ ప్రకటన చేయుచున్నాను. మస్జిద్ లోని ఒక భాగం కాలిపోయి సుమారు రెండు సంవత్సరాలు అవుతుంది. 1984 నుండి ఖిలాఫత్ ఇక్కడ ఉండడం వలన ప్రపంచములోని నలు మూలల నుండి అనేకులు ఇక్కడికి వస్తున్నారు. వారి విడిది, ఇతరాత్ర కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచ వివిధ దేశాల ఉపశాఖల వారు, కొన్ని బృందాల రూపంలో సంవత్సరమంతయు ఇక్కడికి వస్తూ పోతూ ఉంటారు. వారి బసకు తగిన ఏర్పాట్లు చేయవలసి ఉంటుంది.

మస్జిద్‌నకు ఆనుకొని కొన్ని గదులు యుండేవి. ఆవరణ యుండేది. గతంలో అక్కడే ఏర్పాట్లు చేసేవారు. ఆ భాగం అగ్నికి ఆహుతి అయిన తరువాత చాలా ఇరుకుగా ఏర్పడింది. అందుకని ఆ భాగాన్ని మరల నిర్మించు కార్యక్రమాన్ని రూపొందించారు. చాలా పెద్ద ప్రణాళిక ఇది. నిర్మించవలసిన స్థలం కొంచమే ఉన్నా కూడ ప్రణాళిక చాలా పెద్ద ఎత్తులో రూపొందించడం జరుగుతుంది. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిర్రాబే రహ్మహుల్లాహ్ తాలా ఈ మస్జిద్ నిర్మాణంను చేపట్టినప్పుడు ప్రారంభములో 50 లక్షల పౌండ్స్ సేకరణ కోసం ప్రకటన చేసిరి. కాని మస్జిద్ యొక్క ముఖ్య భాగాన్ని వదిలి ఇతర భాగాల కోసం ఖర్చు చేయడం వలన మరల మరో 50 లక్షల పౌండ్స్ సేకరణ కోసం ప్రకటన చేసిరి. ఆ తరువాత కూడ చాలా పనులు క్రమ క్రమంగా పూర్తి చేయడం జరిగింది. ఈ ఖర్చును జమాఅత్ తన వార్షిక బడ్జెట్ నుండి ఖర్చు చేసింది. ఈ విధముగా చాలా వరకు ఏర్పాట్లన్నియు పూర్తి చేయడం జరిగింది. ఏది ఏమైనప్పటికి జరిగింది ఒక దుర్ఘటణ.

అల్లాహ్ తఆలా విధి ప్రకారం జరిగిందని భావించాము. మంటలు అంటుకున్నాయి, చాలా భాగం కాలిపోయినది. నూతనంగా ఏర్పాటు చేసిన ప్రణాళిక ప్రకారం కూడ ఇప్పుడు ఆ మస్జిద్ పునర్ నిర్మాణం కోసం ఒక కోటి 10 లక్షల పౌండ్స్ అవసరము గలవు. ఇన్సూరెన్స్ ద్వారా కొంత నగదు లభించినది, ఇతరులు చెల్లించినది చూచినచో అందులో సగ భాగం ప్రోగు అయినది. బహుశా సగ భాగానికి కన్నా ఎక్కువ ధనం ప్రోగు చేయవలసి యున్నది. గతంలో చేసినట్లు ప్రస్తుతం కూడ జమాఅత్ సభ్యులే ఇందుకై ధనమును ప్రోగు చేయవలసి యున్నది.

బైతుల్ ఫుతుహ్ మస్జిద్ సంపూర్ణముగా అందముగా ఉన్నప్పుడు యూరప్ ఖండంలో గల 50 అందమైన నిర్మాణాలలో ఒకటిగా పరిగణించేవారు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిర్రాబే రహ్మహుల్లాహ్ తఆలా ఈ ప్రకటన చేసినప్పుడు ఆ మస్జిద్ యూరప్ ఖండములోనే పెద్ద మస్జిద్‌గా గుర్తింపు పొందునని భావిస్తున్నట్లుగా ఆకాంక్షను వ్యక్తపరచిరి. ఈ మస్జిద్‌ను మించి మరే మస్జిద్ కూడ పెద్దగా నిర్మించలేరని కూడ ఆశాభావాన్ని తెలిపిరి. 7 వేల నుండి 8 వేల వరకు ఈ మస్జిద్‌లో వచ్చినచో చాలా సంతోషముగా ఉండునని కూడ వారు తెలిపిరి. కాని మస్జిద్ ప్రాంగణములను పరిగణలోకి తీసుకున్నచో 10 వేల మంది ఈ మస్జిద్‌లో ఒకేసారి పాల్గొనవచ్చును.

(సేకరణ అల్ ఫజల్ ఇంటర్నేషల్ 7-13 ఏప్రిల్ 1995, పుట 5,6 . మరల 23-30 మార్చి 2001, పుట 6)

కాని ఆ సామర్థ్యం కూడ రెండు మూడు సంవత్సరాల తరువాత తగ్గిపోయింది. ఇతర జమాఅత్ సభ్యులు ఇచటికి పండుగ నమాజ్‌లు సలుపుటకు రాకండి, మీ మీ ప్రాంతములోనే నమాజ్‌లు సలపండి అని ప్రకటనలు చేయవలసి వచ్చేవి. అయినా కూడ ప్రజలు రావడం వలన ఉద్యానవనంలో ఏర్పాట్లు చేసి పండుగ నమాజ్‌లు సలుపే వారము. మొత్తానికి అవసరం ఉన్నది. మనకు సాధ్యమైనంత వరకు ఎంత పెద్దగా, విశాలముగా నిర్మించగలమో అంత పెద్దగా విశాలముగా

నిర్మించడానికి చాలా వరకు ప్రయత్నించాలి. గతంలో ఈ మస్జిద్ నిర్మాణంలో భాగస్వాములయ్యే భాగ్యం పొందని వారందరు ఈ సారి చేపట్టే నిర్మాణములో తప్పక భాగస్వాములు కావలెను. ఎందుకనగా ఇది యు.కే (UK) జమాఅత్ ప్రణాళిక. వాస్తవానికి మనము చూచినచో ఇది యు.కే (UK) జమాఅత్ సభ్యుల బాధ్యత. జమాఅత్ నిర్మాణం కావున ఇక్కడి జమాఅత్ సభ్యులందరు అధికముగా భాగస్వాములు కావలెను. అదే విధముగా ఇతర దేశాలలో ఆర్థిక స్థోమత గల వారందరు కూడ ఇందులో పాల్గొనాలి. జమాఅత్ పరంగా, ఉపశాఖల పరంగా వారు తమ సామర్థ్యాన్ని బట్టి ఇందులో భాగస్వాములు కావలెను. ఎందుకనగా సంవత్సరమంతయు ఇక్కడికి అతిథులు వస్తూనే ఉంటారు. యు.కే (UK) జమాఅత్ ప్రతి నెల వారికి అతిథి మర్యాదలు చేయుచూనే ఉంటుంది. ఈ సంఖ్య నేడు వేలలోకి చేరుకుంది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సందర్భములో ఇలా తెలిపిరి.

> ''ఆలంగీర్ చక్రవర్తి కాలంలో రాజమందిరపు మస్జిద్‌కు మంటలు అంటుకున్నాయి. ప్రజలు పరుగులు తీయుచూ చక్రవర్తి వద్దకు వచ్చి మస్జిద్‌నకు మంటలు అంటుకున్నాయి అని తెలిపిరి. ఈ వార్త వినగానే చక్రవర్తి వెంటనే సజ్దాలోకి వెళ్ళి దేవునికి కృతజ్ఞతలు తెలిపెను. అక్కడున్న పౌరులు ఆశ్చర్యముతో చక్రవర్తి గారు ఇది కృతజ్ఞతలు తెలుపుకోవలసిన సమయం కాదు కదా? ఒక వైపు రాజమందిరపు మస్జిద్ అగ్నికి ఆహుతి అగుచున్నది. మరొక ప్రక్క ముసల్మానుల హృదయాలు ఆవేదనతో తల్లడిల్లిపోతున్నాయి అనిరి. అందుకు చక్రవర్తి నిదానంగా ఇలా సమాధానమిచ్చిరి. ఎంతో పెద్దదిగా, వైభవోపేతంగా నిర్మించబడిన మస్జిద్ ఇది, దీని ద్వారా కొన్ని వేల మంది ప్రజలు ప్రయోజనం పొందు

చున్నారు. బహుశా ఏదైనా ప్రణాళిక కారణంగా నేను కూడ ఈ పుణ్యకార్యములో భాగస్వాముడినైనచో ఎంత భాగుండునని చాలా కాలం నుండి ఎదురు చూచుచున్నాను. కాని నలు దిక్కుల నుండి ఇది సంపూర్ణముగా, ఎలాంటి లోటు పాట్లు లేనిదిగా యున్నట్లు కనిపించు చుండెను. ఏ విధముగా నేను ఈ పుణ్యకార్యములో భాస్వాముడను అవుతాను అనే విషయం నాకు ఏమాత్రం అర్థం కాకుండా పోయింది. కాని నేడు అల్లాహ్ తఆలా ఈ పుణ్యకార్యములో భాగస్వాముడను అగుటకు నాకు ఒక మార్గమును తెరిచినాడు. وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ నిశ్చయముగా అల్లాహ్ తఆలాయే సర్వ శ్రవణ సమర్థుడు, సర్వజ్ఞుడవు."

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 387 ఎడీషన్ 1985 ముద్రణ ఇంగ్లాండ్)

కావున నేను ఇంతకు ముందు తెలిపినట్లుగా గతములో భాగస్వాములు కాని వ్యక్తులు ఈ ప్రణాళికలో తప్పకుండా భాగస్వాములు కాగలరు. మీరు చేసిన వాగ్దానములను మూడు సంవత్సరాల లోపు చెల్లించుటకు ప్రయత్నించండి, మీ వాగ్దానములో మూడవ వంతు మాత్రం మొదటి సంవత్సరములోనే చెల్లించండి.

ఈ ప్రణాళిక వివరములు ఇలా గలవు. గతంలో covered నిర్మించిన ఈ ప్రాంతం నాలుగు వేల ఏడు వందల చదరపు మీటర్లు. కాని ప్రస్తుతం చేపట్టుచున్న ప్రణాళిక ప్రకారం దీని వైశాల్యం ఐదు వేల ఎనమిది వందల చదరపు మీటర్లు. వీటితో పాటు నాసిర్ హాల్ పైకప్పు ఎత్తును కూడ పెంచడం జరిగింది. రెండవ అంతస్థులో కార్యాలయములు ఏర్పాటు చేయబడను, మూడవ, నాలుగవ అంతస్థులో కార్యాలయములు (exhibition hall) ప్రదర్శన శాలలు, ప్రాంగణములు, అతిథులకై వసతి గృహాలు వంటివి నిర్మించాలని నిర్ణయించబడింది. ముఖ ద్వారం నుండి కొంత దూరంలో దీని నిర్మాణం

చెపట్టబడును, ఫలితముగా పార్కింగ్‌కు కూడ సౌకర్యం లభించును. తద్వారా వాహనాల రాకపోకలు సులభముగా జరుగును. కాలి నడక నడిచేవారికి కూడ సౌలభ్యంగా ఉండును. మహిళలకు, పురుషులకు వేరు వేరు దారులు ఏర్పాటగును. ఇది ప్రణాళిక. అల్లాహ్ తఆలా మనకు సహకరించును గాక! యు.కే UK జమాఅత్‌కు ఈ ప్రణాళికను పూర్తి చేయి భాగ్యమును అల్లాహ్ తఆలా కల్పించుగాక!

నమాజుల తరువాత నేను గౌ॥ ఆదిల్ హమూద్ నాఖూజ యెమెన్ వాస్తవ్యుల పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతును.

(ఈ సందర్భమున వారి సద్గుణములను హుజూరె అన్వర్ వివరంగా ప్రస్తావించి జుమా, అసర్ నమాజుల తరువాత వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన కూడ చదివించిరి.)

**(TELUGU TRANSLATION)**

**FRIDAY SERMON**

Delivered By
HAZRAT KHALIFATUL MASEEH V aba
on 3rd November 2017
at Baitul Futuh Mosque Morden, London - UK

**PUBLISHER**
WAKALAT-E-MAL TAHRIK-E-JADID
ANJUMAN AHMADIYYA BHARAT QADIAN

PRINTED AT
FAZL-E-UMAR PRINTING PRESS QADIAN-143516
DISST: GURDASPUR, PUNJAB, INDIA